అరటి సాగుపై దృష్టి సారించిన రైతులు

- నియోజకవర్గంలో 10వేల ఎకరాలలో సాగు
- అరటి మొక్కలకు పెరిగిన డిమాండ్
- వేసవిలో భారంగా మారిన మొక్కల సంరక్షణ


తోటలో నాటేందుకు సిద్ధంగా ఉన్న అరటి మొక్కలు

వేముల : ఈ ఏడాది అరటి సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. అరటి సాగు విస్తీర్ణం పెరుగుతుండటంతో కంపెనీలు అరటి మొక్కలను సప్లయ్ చేయలేకపోతున్నాయి. ఒకేసారి రైతులంతా అరటిపైనే మొగ్గు చూపడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఆర్డర్లు తీసుకున్న రైతులకు అరటి మొక్కలను సకాలంలో సరఫరా చేస్తామా లేదా అనే విషయంలో కంపెనీలు సందిగ్ధంలో పడినట్లు తెలుస్తోంది. ఎప్పుడు లేని విధంగా ఈ ఏడాది అరటి సాగు రైతులు ఆసక్తి చూపడంతో అరటి మొక్కలకు డిమాండ్ పెరిగింది. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకున్న కంపెనీలు ఒక్క మొక్కపై రెండు నుంచి మూడు రూపాయలు ధరలు పెంచి సప్లయ్ చేస్తున్నారు.

నియోజకవర్గంలో 10వేల ఎకరాలలో సాగు

ఈ ఏడాది నియోజకవర్గ వ్యాప్తంగా అరటి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. పులివెందుల నియోజకవర్గంలో 10వేల ఎకరాలలో అరటి సాగు అవుతుందని ఉద్యాన శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. నియోజకవర్గంలోని లింగాల, పులివెందుల, వేముల, వేంపల్లె మండలాల్లో అత్యధికంగా, తొండూరు, సింహాద్రిపురం, చక్రాయపేట మండలాల్లో అక్కడక్కడ రైతులు అరటిని సాగు చేస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు. అయితే నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం విస్తీర్ణంలో ఈ ఏడాది 20 శాతం మేర అరటి సాగు విస్తీర్ణం పెరుగుతోందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. మార్చి నుంచి జూన్ చివరి వరకు రైతులు నియోజకవర్గ వ్యాప్తంగా అరటి సాగు చేస్తారు. ముందుగా సాగు చేయడంద్వారా ముందుగానే దిగుబడులు వస్తే ధరలు ఉంటాయని ఉద్దేశ్యంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో సాగు చేస్తున్నారు.

అరటి మొక్కలకు పెరిగిన డిమాండ్ :

అరటి సాగు విస్తీర్ణం పెరుగుతుండటంతో అరటి మొక్కలకు డిమాండ్ పెరిగింది. అయితే గతంలో ఎప్పుడు అరటి మొక్కలకు ఇంత డిమాండ్ లేదని, ఈ ఏడాది అరటి మొక్కలకు విపరీతమైన డిమాండ్ ఉందని కంపెనీల ప్రతినిధులు అంటున్నారు. నియోజకవర్గంలో ఎక్కువగా ఎక్సెల్, విప్రో, వీటా, తుర్లపాటి, ఏసీఆర్, కాడిల్లా వంటి కంపెనీలకు చెందిన గ్రాండ్ నైన్ అనే అరటి రకరం ఈ ప్రాంతంలో సాగు చేస్తారు. ఇప్పటికే మార్చి చివర, ఏప్రిల్ మొదటి వారంలో అరటి సాగు చేసే రైతులు ఆయా కంపెనీలతో మాట్లాడి మొక్కలకు అడ్వాన్స్ కూడా చెల్లించారు. ఒక్క మొక్క రూ.15 నుంచి రూ.18 ధర ఉందని, రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని ధరలు పెంచే అవకాశం లేకపోలేదని, ఇప్పుడు మార్చి, ఏప్రిల్ నెలల్లో మొక్కలు కావాలని అడ్వాన్స్ ఇస్తామని వెళుతున్న రైతులకు మొక్కలు సరఫరా చేయలేమని చేతులెత్తేస్తున్నారు. అరటి సాగులో పెట్టుబడులు రైతులకు భారంగా మారాయి. సాగులో పెట్టుబడులు అవుతున్నా సాగుకు రైతులు వెనకడుగు వేయడంలేదు.


వేసవి బారి నుంచి మొక్కలకు సంరక్షణగా ఈత ఆకులు

ఇప్పటికే అక్కడక్కడ సాగైన అరటి.. :

ఈ ఏడాది మార్చి మొదటి వారంలోనే అక్కడక్కడ రైతులు అరటి సాగు చేశారు. మార్చి నెలలో వేసవి ఎండలు ఎక్కువగా ఉంటాయని తెలిసినా రైతులు అరటి సాగు చేశారు. మార్చి నెలలో అరటి సాగు చేస్తే జనవరి, ఫిబ్రవరి నెలలో దిగుబడులు చేతికి వస్తాయని, ఆ సమయంలో ధరలు ఉంటాయనే ఉద్దేశ్యంతో అరటి సాగు చేశారు. గాలి వానల బారి నుంచి బయట పడవచ్చుననే రైతులు ముందుగానే అరటిని ఎంచుకున్నారు. ఇప్పటికే అరటి సాగు చేసిన రైతు మొక్కలకు ఎండ బారి నుంచి కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కొంత మంది రైతులు మొక్కలకు గుడ్డ కవర్లు, మరికొంత మంది రైతులు మొక్కలకు ఈత ఆకు కప్పి సూర్య రశ్మి తగలకుండా జాగ్రత్త పడుతున్నారు.

మొక్కల సంరక్షణ భారమవుతోంది



ఈ ఏడాది మార్చి మొదటి వారంలో అరటి మొక్కలు నాటా.. ఒక మొక్క రూ.17లతో కొనుగోలు చేశా. రెండు ఎకరాలలో అరటి సాగు చేశా. వేసవిలో ఎండలకు మొక్కల సంరక్షణ భారమవుతోంది. మొక్కలు దెబ్బతినకుండా మొక్కలపై గుడ్డ కవర్లు కప్పి కాపాడుకుంటున్నాం.

– కె.ఓబుళరెడ్డి, రైతు, వేల్పుల

అరటి మొక్కలకు డిమాండ్ ఉంది



ఈ ఏడాది అరటి మొక్కలకు భారీ డిమాండ్ ఉంది. అరటి సాగుకు ముందుకు వస్తున్నారు. మా ల్యాబ్‌లో 5 లక్షల మొక్కలకు ఆర్డర్లు తీసుకున్నాం. రైతులకు సకాలంలో మొక్కలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మొక్కలు కావాలని రైతులు అడుగుతున్నారు. సప్లయ్ చేయలేమని రైతులకు చెబుతున్నాం.

– కృష్ణమూర్తి యాదవ్, అరటి ల్యాబ్ యజమాని, ఇ.కొత్తపల్లె

ధరలు ఉండటంతోనే రైతులు ఆసక్తి



ఈ ఏడాది అరటి ధరలు ఉండటంతో రైతులు అరటి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పుడున్న ధరలు ఎప్పుడు ఉంటాయని రైతులు ఎండలు ఉన్నప్పటికి అరటిని సాగు చేస్తున్నారు. ఈ ఏడాది మొత్తం విస్తీర్ణంలో 20 శాతం మేర సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

– రాఘవేంద్రారెడ్డి, హెచ్ఓ, పులివెందుల

నేడు ముద్దల పండుగ

వీరపునాయునిపల్లె : మండలంలోని పాయసంపల్లె, ఈర్లపల్లె, కొమ్మద్ది, మొయిళ్లచెరువు తదితర గ్రామాల్లో ఆదివారం ముద్దల పండుగను నిర్వహించనున్నారు. వృత్తి రీత్యా పట్టణాల్లో విధులు నిర్వహిస్తున్న వారందరు వారి వారి గ్రామాలకు చేరుకొన్నారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది. ఆయా గ్రామాల్లోని అమ్మవార్లకు జంతు బలులు ఇచ్చి మొక్కులు చెల్లించుకోనున్నారు.

ఘనంగా వీడ్కోలు వేడుక


వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తొండూరు : స్థానిక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక సంబరంగా సాగింది. ఆటపాటలతో విద్యార్థులు సందడి చేశారు. ఉదయం సరస్వతీ పూజ, మధ్యాహ్నం ఉపాధ్యాయుల విలువైన ప్రసంగాలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో వీడ్కోలు వేడుక ఆనందంగా సాగింది. విద్యార్థులు పాఠశాలకు రూ.15000 విలువైన ప్రధానోపాధ్యాయుల టేబుల్‌ను వితరణగా అందించడం విశేషం.

రేపు నిరసన ర్యాలీ

కడప కల్చరల్ : జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం కడప నగరంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా అధ్యక్షులు నందారపు చెన్నకృష్ణారెడ్డి తెలిపారు. ఇటీవల రాయచోటిలో వీరభద్రస్వామి ఉత్సవ ఊరేగింపుపై జరిగిన దాడికి నిరసనగా ఈ కార్యక్రమం చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కడప నగరం మృత్యుంజయకుంట శివాలయం నుంచి కలెక్టరేట్ వరకు శాంతియుత నిరసన ర్యాలీ ఉంటుందన్నారు.

క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పరగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో ముస్లింలు

పులివెందుల రూరల్ : మండలంలోని ఎర్రిపల్లె జామియా మసీద్‌లో శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నూర్ బాషా సంఘ చైర్మన్ రసూల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింలు కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయ మతసామరస్యానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా, మురారి చింతల ప్రెసిడెంట్ బాబారజాఖ్, ఎంపీటీసీ ముస్తఫా బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

రాజీ కావడం ఉత్తమం


మాట్లాడుతున్న జడ్జి ఎస్.భార్గవి

జమ్మలమడుగు రూరల్ : కేసులు పరిష్కారానికి కక్షిదారులు రాజీ కావడం ఉత్తమం అని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. శనివారం కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని పోలీస్ అధికారులతో కలసి ఆమె నిర్వహించి మాట్లాడారు. చిన్న చిన్న కేసులతో సంవత్సరాల తరబడి పోలీస్‌స్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరగడం వల్ల కక్షిదారులకు విలువైన సమయంతో పాటు డబ్బులు వృథా అవుతాయన్నారు. కక్షిదారులు రాజీ అయితే ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న కమిటీ అధ్యక్షుడు చలమయ్య

ఎర్రగుంట్ల : పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహ మెడికల్ స్టోర్ యజమాన్యం రాంప్రసాద్ ఆర్థిక సహకారంతో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేసినట్లు పీపుల్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీ అధ్యక్షుడు కె.చలమయ్య శనివారం తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో శాంతినగర్ కాలనీలోని మహిళ దినోత్సంను ఘనంగా నిర్వహించి పలువురు మహిళలను సత్కరించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తులసీరాం


అధ్యక్షుడు తులసీరాం


ఉపాధ్యక్షుడు ఎ.ప్రతాప్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా తులసీరాం, వైస్ ప్రెసిడెంట్‌గా ఎ.ప్రతాప్‌రెడ్డి, సెక్రటరీగా వి.కిశోర్‌కుమార్ రెడ్డి, ట్రెజరర్‌గా ఎన్.లక్ష్మీనరసింహులు, జాయింట్ సెక్రటరీగా శశిరేఖలను శనివారం ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ ఎన్నుకున్నందుకు సీనియర్లకు, ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. బార్ అసోసియేషన్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి బార్ అసోసియేషన్ అభివృద్ధి పథంలో నడిపించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

మహిళా ఉపాధ్యాయులపై దాడి హేయమైన చర్య

వేంపల్లె : మహిళా ఉపాధ్యాయులపై భౌతిక దాడి చేయడం హేయమైన చర్య అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.సుష్మా తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు నాగాంజలి, ప్రభావతిలపై దాడితోపాటు, సునీతపై అసభ్య పదజాలంతో దూషించిన ఘటన సభ్య సమాజాన్ని తలదించేలా చేసిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా సగర్వంగా జరుపుకునే సందర్భంలో తోటి ఉపాధ్యాయుడు మహిళా ఉపాధ్యాయులపై దాడి చేయడమనేది సమంజసం కాదన్నారు. ఘటన జరిగిన వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులు విచారించి పీజీటీ ఉపాధ్యాయుడు గుర్నాథ్ రెడ్డితోపాటు హెడ్మాస్టర్ నారాయణమ్మలను సస్పెండ్ చేయడం అనేది సంతోషించదగ్గ విషయమన్నారు.

భూ వివాదాలకు పరిష్కారం


అధికారులకు సూచనలు, సలహాలు ఇస్తున్న ఎంపీడీఓ రామచంద్రారెడ్డి

జమ్మలమడుగు రూరల్ : రీ సర్వే వల్ల హక్కుదారులకు కచ్చితమైన రికార్డులు లభిస్తాయని డివిజనల్ పంచాయతీ అధికారి తిమ్మక్క, ఎంపీడీఓ వై.రామ చంద్రారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని డివిజనల్ కార్యాలయ సభా భవనంలో స్వామిత్వపై డివిజనల్ సర్వేలు, ఎంటటీలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్వే వల్ల భూ రికార్డులతో పాటు ఆస్థి వివాదాలు సమసిపోయి సరైన ఆస్థి హక్కు రికార్డులు కల్పిస్తారని వారు సూచించారు. అనంతరం రోవర్ వినియోగం, కొలతలు సాఫ్ట్‌వేర్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓలు హజర్ కావలసి ఉండగా డుమ్మా కొట్టారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం

ఖాజీపేట : మండలంలోని రంగాపురం గ్రామంలో శనివారం చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం అశేష భక్తజన సందోహం నడుమ వైభవంగా సాగింది. తొగట వీర క్షత్రియులు అమ్మవారి జ్యోతులను తలపై పెట్టుకుని నృత్యం చేస్తూ, అమ్మవారిని స్మరిస్తూ డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. గర్భాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి జ్యోతులను సమర్పించారు.

రేపు ఎన్‌టీఆర్ వైద్య సేవ ఉద్యోగుల శాంతియుత నిరసన

పులివెందుల : వైఎస్సార్ కడప జిల్లాలో డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకంలో ఫీల్డ్ ఉద్యోగులైన వైద్య మిత్ర టీం లీడర్స్, జిల్లా మేనేజర్స్, ఆఫీస్ అసోసియేట్స్, డీఈఓ పూర్తి సిబ్బంది ప్రధాన సమస్యల పరిష్కారం కొరకు మార్చి 10, 17, 24వ తేదీలలో విధులు బహిష్కరించి శాంతియుత నిరసన నిర్వహిస్తున్నట్లు కడప జిల్లా ప్రెసిడెంట్ విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఈ మూడు రోజులు ఆసుపత్రులలో విధులలో డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండరన్నారు. రోగులు, ఆసుపత్రి యాజమాన్యాలు సహకరించాలని ఆయన కోరారు.

శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మురుగు నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేక ఆలంఖాన్ పల్లె, దస్తగిరి పేట డ్రైనేజీ నీరంతా శ్మశానంలో నిలుస్తూ జంబు, బురదతో నిండి ఉందని సీపీఐ నగర కార్యదర్శి యస్. వెంకట శివ పేర్కొన్నారు. శనివారం నగరంలోని 49 వ డివిజన్ పరిధిలోని ఆలంఖాన్ పల్లె శ్మశానం లో నిలిచిన మురుగు నీటిని, కంప చెట్ల ను సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సమస్య పై రెండేళ్లగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు.

దివ్యాంగులకు గృహోపకరణాల వితరణ


దివ్యాంగులకు గృహోపకరణాలను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని దివ్యాంగుల కమ్యూనిటీ భవనంలో శనివారం వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగపు నియోజకవర్గ కన్వీనర్ చాగలేటి భాస్కర్‌కు అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ వేముల మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి హాజరై దివ్యాంగులకు హాట్ బాక్స్‌లు, కూల్ వాటర్ క్యాన్లు తదితర గృహోపకరణాలను అందించారు. అనంతరం భాస్కర్ నాగేళ్ల సాంబశివారెడ్డిని సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప, చాగలేరు ఎంపీటీసీ వెంకటస్వామి, వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు అగ్రహారం రవి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

వారణాసి చేరుకున్న మహా పాదయాత్ర


కాశీ చేరుకున్న శేషయ్య, స్వామిజీలు

పులివెందుల టౌన్ : హిందూ ధర్మ ప్రచార సమితి సభ్యులు శేషయ్య ఆధ్వర్యంలో చేపట్టిన కాశీ మహాపాదయాత్ర శనివారం వారణాసికి చేరుకుంది. పులివెందుల నుండి వారణాసికి చేపట్టిన పాద యాత్ర 36 రోజులపాటు 1675 కిలోమీటర్లు చేయ డం జరిగిందని శేషయ్య తెలిపారు.

సృష్టిలో స్త్రీశక్తి అనంతం


పులివెందులలో పారిశుధ్య మహిళా కార్మికులను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : సృష్టిలో స్త్రీశక్తి అనంతమని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ కమిషనర్ రాముడు, వైస్ చైర్మన్ హాఫీజ్, పట్టణ కన్వీనర్ గంగాధర్‌రెడ్డిలు హాజరై స్త్రీశక్తి గురించి మహిళా దినోత్సవ ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం వైద్యులు శరన్యా రెడ్డి, గంగాదేవి, జ్యోతి, మెప్మా సీఓ నాగలక్ష్మిలతోపాటు మున్సిపల్ పారిశుధ్య కార్మిక మహిళలను, మెప్మా, డ్వాక్రా మహిళలను సత్కరించారు. పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఉచిత విద్యా ఉపాధ్యాయిని బృందాన్ని సత్కరించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలోవ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, హెడ్మాస్టర్ సుధాకర్‌రెడ్డి, సేవా సమితి అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మున్సిపల్ కమిషనర్ రాముడు హాజరై మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ఆడవారి యొక్క పనితీరును అభినందించారు. ఆంధ్ర ప్రగతి రాయలసీమ గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ఉమామహేశ్వరి మహిళాశక్తి గురించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ ఏసురత్నం, ఉమా మహేశ్వరీ, ప్రాజెక్ట్ మేనేజర్ వల్లి, కమ్యూనిటీ సభ్యులు, సిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవి క్లబ్, వనిత క్లబ్, ఆవోప సంఘం ఆధ్వర్యంలో 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న మహిళా మణులకు పాదపూజ చేసి సన్మానించారు.

జేఎన్టీయూ కళాశాలలో..

పులివెందుల రూరల్ : పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు దిశ, సఖి వన్‌స్టాప్ సెంటర్ అధికారి అశ్వని హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు యవ్వనంలో వచ్చే భావోద్వేగాల నుండి బాధ్యతతో ప్రవర్తించాలన్నారు. పురాణ కాలం నుంచి స్త్రీ మీద ఉన్న గౌరవాన్ని, నమ్మకాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం మహిళా అధ్యాపకులను ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ శేష మహేశ్వరమ్మలు సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ట్రిపుల్ఐటీలో మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి అపర్ణ


జేఎన్‌టీయూ వేడుకలలో ప్రిన్సిపాల్, తదితరులు


వేములలో ఎంపీపీకి బహుమతిని అందిస్తున్న జెడ్పీటీసీ కె.వెంకట బయపురెడ్డి


సింహాద్రిపురంలో విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ఎస్ఐ తులసీ నాగప్రసాద్

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో..

వేంపల్లె : దేశంలోని అన్నిరంగాల్లో మహిళలకు కూడా సమాన అవకాశాలు కల్పిస్తే దేశ పురోభివృద్ధి జరుగుతుందని ఇడుపులపాయ ట్రిపుల్ఐటీ ఎన్ఎస్ఎస్–8 ప్రోగ్రాం ఆఫీసర్ అపర్ణ తెలిపారు. ట్రిపుల్ఐటీలో విద్యార్థినులకు సమాజంలో మహిళల పాత్ర అనే అంశంపై వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. అలాగే స్థానిక వికాస్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దీప్తి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో

సింహాద్రిపురం : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఎస్ఐ తులసి నాగప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీవివేనంద స్కూల్, శ్రీమేథా స్కూల్, కస్తూర్బా గురుకుల విద్యాలయ విద్యార్థులతో బుద్దాయపాలెం సర్కిల్ నుండి గురిజాల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గురిజాల సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. మహిళా వారోత్సవాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డి, ఏపీఎం మంజునాథ్‌ల ఆధ్వర్యంలో మహిళా మండలి సమాఖ్య సభ్యుల మహిళలకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.


జమ్మలమడుగులో బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ


ఎర్రగుంట్ల : మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణయ్య

వేములలో..

వేముల : ప్రస్తుత సమాజంలో అన్ని రంగాలలో మహిళలదే కీలక పాత్ర అని జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించినప్పుడే సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆటల పోటీలలో గెలుపొందిన మహిళలకు జెడ్పీటీసీ సొంత నిధులతో బహుమతులను ప్రదానం చేశారు. ఎంపీపీ చల్లా గంగాదేవిని సత్కరించి బహుమతిని అందజేశారు. అలాగే జెడ్పీటీసీ వెలుగు సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఆంజనేయులు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో రాణించడంతోపాటు మహిళలు చదువుకున్న కుటుంబంలో అందరు విద్యావంతులుగా తయారవుతారని ఆర్డీఓ ఏ.సాయిశ్రీ తెలిపారు. శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా అర్బన్ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక గౌసియా షాదీఖానాలో సీఐ లింగప్ప అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళల హక్కులపై ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. మహిళలకు రక్షణ చట్టాలు ఉన్నాయని ఏమైన సమస్యాలు వచ్చినప్పుడు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించిన మహిళలకు సన్మానం చేయడంతో పాటు వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబచరచిన మహిళలకు బహుమతులను ప్రధానం చేశారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. మహిళా దినోత్సవ సందర్భంగా అన్నమాచార్య విద్యాసంస్థల ఈడీ చొప్పా అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర చాలా గొప్పదన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళలు విజయాలను ఎలా సాధించాలో వివరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అన్నమయ్య జిల్లా రాయచోటి అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ (ఏసీటీఓ) జె.సునీత మాట్లాడుతూ ఎక్కడైతే స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు కొలువు ఉంటారన్నారు. అనంతరం ఆటల పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్కో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కీర్తన, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.


పులివెందులలో వృద్ధ మహిళలను సత్కరిస్తున్న ఆవోపా, ఆర్యవైశ్య మహిళా మండలి సంఘ సభ్యులు

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : ప్రస్తుతం సమాజంలో పురుషులతో సమానంగా అన్ని రంగాలలో మహిళలు సత్తా చాటుతున్నారని ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. శనివారం కలమల్ల గ్రామ పంచాయతీ ఆవరణలో మహిళ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కడప జిల్లాలోని కలమల్ల గ్రామ పంచాయతీని మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీగా ఎంపిక చేసిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హెబ్సీబా, ఈఓపీఆర్డీ రహంతులయ్య, ఏపీఎం జగదీశ్వరీ, చిలంకూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి సాయిచరితారెడ్డి, ఉపమండలాధ్యక్షుడు పొన్నాశ్రీను తదితరులు పాల్గొన్నారు.